ప్రజాశక్తి

ఆదివారం 3 మార్చి 2024 5

శ్రీ సత్యసాయి



ఆరోగ్యశ్రీ కార్డులు
80 శాతం పంపిణీ చేశాం
కలెక్టర్ అరుణ్‌బాబు




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ జిల్లాలో 80 శాతం పూర్తి చేశామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శనివారం విజయవాడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డులు, రెవెన్యూ, రీ సర్వే, మూడవ దశ ఇనాం, అసైన్డ్ భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, ఉపాధి హామీ పథకం తదితర వాటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ పూర్తి అయిందన్నారు. మిగిలినవి త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పల్స్ పోలియోకు సంబంధించి అన్ని చర్యలూ చేపట్టామన్నారు. ఆదివారం ఇంటింటికీ పోలియో చుక్కలు వేయడానికి వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. మూడవ దశ ఇనాం, అసైన్మెంట్ భూములు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన భూమిని కేటాయించడానికి జిల్లాలో సర్వే చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పంచాయతీరాజ్ ఎస్సీ గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, ఆర్అండ్‌బి అధికారి రషీద్ ఖాన్, పంచాయతీ అధికారి విజయకుమార్, డిఎంహెచ్ఒ ఎస్‌వి.కష్ణారెడ్డి, సిపిఒ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని వీడని వర్గపోరు..!



- కదిరిలో గ్రూపులుగా నాయకులు
- మౌనం వీడని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి
- సమన్వయకర్త ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు
- నేడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కదిరికి రాక
- ఎమ్మెల్యే హాజరుపై సందిగ్ధం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో కదిరి వైసిపిలో లుకలుకలు పెరుగుతున్నాయి. రోజురోజుకూ వర్గపోరు తీవ్రం అవుతుండడం దిగువ శ్రేణి నాయకులను తీవ్ర గందరగోళానికి గురి చేస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డిని కాదని వైసీపీ అధిష్టానం మక్బుల్ అహమ్మద్‌ను సమన్వయకర్తగా ప్రకటించింది. అప్పటి నుంచి కదిరి వైసిపిలో వర్గపోరు రాజుకుంది. అందరినీ కలుపుకుని ముందుకెళ్లాల్సిన అధిష్టానం, ముఖ్యనేతలు ఆ దిశగా అడుగులు వేయకుండా గందరగోళం సృష్టిస్తున్నారంటూ ద్వితీయశ్రేణి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కదిరి వైసిపిలో జరుగుతున్న పరిణామాలపై ఎమ్మెల్యే సిద్ధారెడ్డి వర్గీయులు గుర్రుగా ఉన్నారు. మరో వైపు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సైతం ఎలాంటి రాజకీయ వ్యాఖ్యానాలు చేయకుండా మౌనంగా ఉంటున్నారు. సమన్వయకర్త పాల్గొంటున్న సమావేశాల్లో ఎమ్మెల్యేను పరోక్షంగా ఆయన విమర్శిస్తున్నారనే భావన సిద్ధారెడ్డి వర్గీయుల్లో వ్యక్తం అవుతోంది. ఇటీవల నల్లచెరువులో జరిగిన ఓ సమావేశంలో ఎమ్మెల్యేపై నోరు పారేసుకోవడం సమస్యకు మరింత ఆజ్యం పోసింది. ఇక ప్రోటోకాల్‌కు తిలోదకాలు ఇచ్చి ప్రభుత్వ కార్యక్రమల్లో సైతం ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని పిలవకుండానే నిర్వహించేస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేని కాదని సమన్వయకర్త చేత కార్యక్రమాలను నిర్వహిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

ఎమ్మెల్యే లేకుండానే కార్యక్రమాలు..!

గత నెలలో కదిరి రూరల్ పరిధిలోని పివిఆర్ కళ్యాణమండపంలో ఆసరా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆ సమయంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారు. ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ఆయన స్థానంలో అధికారులు సమన్వయకర్త చేతుల మీదుగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిపై అప్పట్లో ఎమ్మెల్యే వర్గీయులు, ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అయ్యాయి. కదిరి రూరల్ మండలం పట్నం వద్ద హంద్రీనీవా కాలువ ద్వారా తలుపుల మండలానికి నీటిని వదిలేందుకు గేట్లను కూడా సమన్వయకర్త మక్బుల్‌అహ్మద్, పూల శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఎత్తారు.

గందరగోళంలో అధికారులు

సమన్వకర్త మారినప్పటి నుంచి కదిరిలో అధికారులు సైతం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట వినడం లేదనే వాదన ఉంది. ఇటీవల కాలంలో దాదాపు అన్ని శాఖల అధికారులు సమన్వయకర్త వద్దకు వెళ్లి వారి శాఖలోని పనుల గురించి తెలియజేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా అధికారులు ఆయన్ను కలవకుండా ఇన్‌ఛార్జి వద్దకు వెళ్తుండడంపై ఎమ్మెల్యే వర్గీయులు గుర్రుగా ఉన్నారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి నియోజకవర్గ పరిధిలోని సచివాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అధికారుల హాజరుశాతం నామమాత్రంగానే కన్పిస్తోంది. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకే అధికారులు ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాల్లో కావాలనే పాల్గొనడం లేదనే ప్రచారం ఉంది. అధికారులు కూడా ఎవరి మాట వింటే ఏ సమస్యలు కొనితెచ్చుకోవాల్సి వస్తుందోనన్న ఆందోళనలో ఉన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక.. ఎమ్మెల్యే హాజరయ్యేనా..?

ఆదివారం నాడు కదిరిలో జరగనున్న ఆసరా పంపిణీ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వకర్త ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. అయితే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి హాజరవుతున్నారా.? లేదా.? అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం ఉందా.. లేదా..! అన్న సందేహాలూ వ్యక్తం అవుతున్నాయి. మొత్తం మీద కదిరి వైసిపిలో నెలకొన్న రాజకీయ వర్గ పోరు ఇప్పుడప్పుడు సమసిపోయేదిలా లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

పన్నులు వందశాతం వసూళ్లు చేయాలి

- వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కల్పించండి
- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం వ్యాప్తంగా అధికారులందరూ కలిసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ తన ఛాంబర్‌లో సచివాలయాల నోడల్ అధికారులతో కలిసి అడ్మిన్, అమ్యూనిటీ సెక్రటరీలతో ఇంటి, నీటి పన్నుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘంలో 34,430 ఇళ్లకు గాను రూ.11.27కోట్లు, 24,128 కొళాయిలకు రూ.5.75కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఇంటి పన్నుల్లో 50శాతం సైతం కూడా వసూలు చేయాలేదన్నారు. నీటి పన్నుల్లో 20శాతం మాత్రమే వసూలు చేశారన్నారు. మార్చి 15 నాటికి 100 శాతం పన్నులను వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికారులు పని చేయాలన్నారు. పన్నుల వసూళ్లకు సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. మార్చి 15 నాటకి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. నీటి పన్నులు చెల్లించని వారి కొళాయి కనెక్షన్‌లను సైతం నోటీసులు ఇచ్చి తొలగించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా వంద శాఇతం పన్నులను వసూలు చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి సుధాకర్, డిఇఇలు వెంకటరమణ, బాలసుబ్రమణ్యం, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు రాము, రామాంజినేయులు, జకావుల్లా, సచివాలయ నోడల్ అధికారులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తరలింపు కుట్రేనా.?

- పాఠశాలలో 250 డెస్కులు మాయం
- విద్యార్థి సంఘాల ఆగ్రహం


డెస్కులను పరిశీలిస్తున్న ఎంఇఒ సల్మాన్ రాజ్, విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పది పరీక్ష కేంద్రాన్ని ప్రయివేటు పాఠశాలకు మార్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతూనే ఉనాయి. పాఠశాలలో డెస్కులు లేవని సాకుగా చూపి కేంద్రాన్ని విద్యాశాఖ అధికారులు మార్చివేశారు. అయితే పాఠశాలలో ఉన్న 250 డెస్కులు ఎక్కడికి వెళ్లాయనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. పాఠశాలలో గతంలో 250 దాకా డెస్కులు ఉండేవి. వీటిలో 150 వరకు బాగున్నాయి. అదనంగా వేరే పాఠశాల నుంచి కొన్ని బెంచీలు, కూర్చీలను తెచ్చి ఉంటే పాఠశాలలో యథావిధిగా కేంద్రాన్ని నడిపేందుకు వీలుండేది. అలా చేయకుండా డెస్కులు లేవని ప్రధానోపాధ్యాయుడు చెప్పడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నాడు కొందరు పూర్వ విద్యార్థులు పాఠశాలలో డెస్కలను చూసేందుకు వెళ్లగా కేవలం 10 డెస్కలను మాత్రమే ప్రధానోపాధ్యాయుడు చూపించారు. పాఠశాలలో ఉండాల్సిన మిగిలిన డెస్కులు ఎక్కడికి వెళ్లాయన్న దానిపై మాత్రం సమాధానం రాలేదు. దీనిపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న డెస్కలను కొందరు అమ్మేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో డెస్కలు లేవన్న సాకు చూపి కేంద్రాన్ని తరలించడం సరికాదన్నారు. కేంద్రాన్ని ప్రయివేటుకు తరలించడంలో పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. దీనిపై విచారణ జరిపించాలన్నారు. పరీక్షా కేంద్రాన్ని యథావిధిగా ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగించమంటే ఉన్నతాదికారులు హాల్‌టికెట్‌లు, ఓఎమ్మార్ షీట్లు ప్రింట్ అయ్యాయని తాము ఏమీ చేయలేమని సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిలమత్తూరు ప్రభుత్వ పాఠశాలలోనే పది పరీక్ష కేంద్రం నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్ష కేంద్రం కావాలంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వివేకనంద బయపెడుతున్నట్లు తెలుస్తోందన్నారు. హెచ్ఎం అనుసరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. వీటన్నింటిపైనా జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పరిశీలన చేసి, పరీక్ష కేంద్రాన్ని చిలమత్తూరు ప్రభుత్వ పాఠశాలలోనే నిర్వహించేలా చూడాలని కోరారు.

బికెకు న్యాయం చేయండి
ఉమ్మడి జిల్లా టీడీపీ పరిశీలకుని కారు అడ్డగింత


టిడిపి పరిశీలకుని కారును అడ్డుకుంటున్న బికె.పార్థసారథి మద్దతుదారులు

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధికి ఎమ్మెల్యే టికెట్టు కేటాయించాలని కోరుతూ ఆయన అభిమానులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. పెనుకొండలోని బికె నివాసం వద్ద శనివారం 7వ రోజు నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలొచ్చి నిరసన తెలిపారు. ఈ సమయంలో టిడిపి నియోజకవర్గం పరిశీలకుడు డాక్టర్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథితో పాటు ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకులు రవీంద్ర పార్థసారధి ఇంటివద్దకు వచ్చారు. ఈ సందర్భంగా బికె అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బికెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బికె.పార్థసారధి కలుగజేసుకుని మాట్లాడారు. పెనుకొండ టికెట్టు ఇవ్వకపోవడంపై తాను మనస్తాపానికి గురైన మాట వాస్తవమే అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు తాను విజయవాడ వెళ్లి ఆయనతో మాట్లాడానని చెప్పారు. తన అవసరం అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఉందాని చెప్పారన్నారు. అయితే తాను పార్టీ శ్రేణులు, మద్దతుదారుల కోరిక మేరకు హిందూపురం పార్లమెంట్ పరిధిలోనే ఉంటానని చెప్పానన్నారు. ఈ నెల 4వ తేదీన చంద్రబాబు నాయుడు పెనుకొండకు వస్తున్న నేపథ్యంలో తనకు న్యాయం చేస్తారని తెలిపారు. ఇదే సమయంలో బికెకు టికెట్టు ఇవ్వాల్సిందేనని ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో టిడిపి పరిశీలకు అక్కడి నుంచి తిరుగు పయనమయ్యారు. బికె.పార్థసారథికి న్యాయం జరగకపోతే చంద్రబాబు సభకు రామని తెగేసి చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో బికె సమావేశమయ్యారు. చంద్రబాబు సభను విజయవంతం చేద్దామని, అక్కడ మనందరికీ న్యాయం జరుగుతుందని సర్ది చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బికె అభిమానులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి : సిపిఎం


కబ్జాకు గురైన భూమిని చూపిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సూరప్పకుంట చెరువు మునక భూమికి అనుకుని ఉన్న సర్వే నెంబరు 404-1ఎలో గల 1.85 ఎకరాల భూమిని కొంత మంది అక్రమ రికార్డులను సృష్టించి కబ్జా చేశారని దీనిని కాపాడాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిపిఎం నాయకులు బాబావలి, సిఖిందర్, నారాయణ కోరారు. కబ్జాకు గురైన భూమిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో హిందూపురం ప్రాంతంలో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసుకోవడం, వాటికి దొంగ రికార్డులను సృష్టించడం ఇతరులకు విక్రయించడం పరిపాటిగా మారిందన్నారు. ఇదే విధంగానే సూరప్పకుంట చెరువు మునక భూమికి అనుకుని ఉన్న సర్వే నెంబరు 404-1ఎలో గల 1.85 ఎకరాల భూమిని కొంత మంది అక్రమ రికార్డులను సృష్టించి, హిందూపురం రిజిస్టర్ కార్యాలయంలో కాకుండా యాడకి సబ్ రిజిస్టర్ కార్యలయంలో అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారన్నారు. కబ్జాకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై రెవెన్యూ చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా నియోజకవర్గం లోని అధికారులు విధులు నిర్వర్తించాలని ఆర్‌డిఒ వెంకటశివరామిరెడ్డి తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికలు విధులు, బాధ్యతలు, విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వసతులు, సౌకర్యాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఏ పోలింగ్ బూత్‌లో తప్పిదాలు లేకుండా, నియమ, నిబంధనలు పాటించి, ఎన్నికలు విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డిఎఒ రమేష్‌బాబు, నాలుగు మండలాల తహశీల్దార్లు, 32 మంది సెక్టార్ ఆఫీసర్లు, పోలీసులు, 28 మంది సూపర్వైజర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

పెనుకొండ : అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పెనుకొండ సెక్టార్ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి సావిత్రమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో శనివారం పెనుకొండ అర్బన్ సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి భావమ్మ హాజరయ్యారు. సెక్టార్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, కార్యదర్శిగా సావిత్రమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


పెనుకొండ సెక్టార్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్యశిబిరం ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న శిల్ప


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న విదేశీ వైద్యులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిల్ప ముందుగా సాయి కాలేశ్వర్ చిత్రపటం వద్ద పూజలు చేసి అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో జర్మనీ దేశానికి చెందిన ప్రముఖ వైద్యులు చెవి, ముక్కు, గొంతు, కంటి, చర్మ సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్న వారికి 44 వినికిడి యంత్రాలు అందించారు. వైద్య శిబిరం బుధవారం వరకూ నిర్వహిస్తామని శిల్ప తెలిపారు. కార్యక్రమంలో విదేశీ వైద్యులు సుసాన్నే, క్రిస్టియన్, టెక్నీషియన్లు రిచర్డ్, పీటర్, ఫిజియోథెరపిస్ట్, జెఎఫ్.ఫ్రెజెన్ రోజ్, ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలను సద్వినియోగం చేసుకోండి


సంచార వైద్యశాలలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి పరిశోధన కేంద్రం హైదరబాద్ బృందం శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద సంచార వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. సంచార వాహనాన్ని బసవతారకం ఆసుపత్రి వైద్యులు సుధాకర్, శ్రావణికుమారి, హిందూపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఒ రుక్మిణమ్మ ప్రారంభించారు. 300 మంది రోగులకు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, తదితర పరీక్షలు చేసి ఒకరిని కర్నూలుకు రెఫర్ చేశారు. మిగిలిన వారిని హైదరా బాద్‌కు రావాలని సూచించారు. ఈ వాహనం ఆదివారం కూడా ఇక్కడే ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరాన్ని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డా.సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పర్యవేక్షిం చారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని హులి కుంట గ్రామంలో శనివారం ఆర్‌డిటి సంస్థ ఆధ్వ ర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రొళ్ల ఏరియా టీమ్ లీడర్ ఓబులేష్ హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళల చదువు ఇంటికి వెలుగు అన్నారు. కార్యక్రమంలో హులికుంట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మారుతి రవి, గ్రామంలోని మహిళా సంఘం లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం


పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని(అంగవైకల్యాన్ని) తరిమికొడదామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 3వ తేదీ(ఆదివారం) జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా శనివా రం డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో ఎనుములపల్లి పిహెచ్‌సి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. గణేష్ సర్కిల్ వద్ద జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు పోలియోపై స్లోగన్లు చేస్తూ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. డిఎంహెచ్ఒ మాట్లాడు తూ ఆదివారం ప్రతి గ్రామంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారన్నారు. మిగిలిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, జిల్లా టిబి, లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒ నివేదిత, ఎనుములపల్లి వైద్యాధికారి జ్యోష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కో ఆర్టినేటర్‌గా చంద్రభాను చతుర్వేది ఎంపిక



హిందూపురం : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్‌గా హిందూపురం పట్టణానికి చెందిన చంద్రభాను చతుర్వేదినియమిస్తూ ఆ సంస్థ శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ విషయంపై చంద్రభాను చతుర్వేది మాట్లాడుతూ గత కొన్ని సంత్సరాలుగా సాంప్రదాయ నత్య గురువుగా తాను రాణిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు అయ్యిందన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ శ్రీ సత్య సాయి జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్‌గా తనను నియమించడంపై ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



మీడియాతో మాట్లాడుతున్న టిడిపి బూత్ ఇన్‌ఛార్జులు

ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే మూకుమ్మడి రాజీనామా

మడకశిర : టిడిపి అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే 237మంది బూత్ ఇన్‌ఛార్జులు మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో శనివారం బూత్ ఇన్‌ఛార్జులు కరికెరస్వామి, నారాయణప్ప, నాగరాజ్, ప్రకాష్, రామచంద్రప్ప, తదితరులు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు అభ్యర్థి సునీల్‌కుమార్ ఎంపిక పట్ల పునరాలోచన చేయాలని కోరారు. లేనిచో పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గాండ్లపెంట : ఎంపిడిఒ కె.రామా నాయక్ శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వేడి వేడిగా అందించాలన్నా రు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మధ్యాహ్నం భోజన ఏజెన్సీలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముంతాజ్ అలీ, ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బికె పరామర్శ

రొద్దం : మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన నారాయణప్ప శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి ఆ గ్రామం వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట నరసింహులు, చిన్నప్పయ్య, సంజీవ రెడ్డి, నాగభూషణ, ధనుంజయగౌడ్, నాగేంద్ర ఉన్నారు.

సబ్సిడీపై సోలార్ ప్లాంట్

విద్యుత్ శాఖ ఈఈ గంగాధర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేద, మధ్య తరగతి ప్రజలు విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రవేశపెట్టిందని విద్యుత్ శాఖ ఈఈ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో శనివారం ఈఈ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించా రు. ఈ పథకం ద్వారా ఇంటి పైకప్పుపై రాయితీతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 0-150 యూనిట్లు వాడే గృహ వినియోగదారులకు 1 కిలోవాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారని ఇందుకు రూ. 30 వేల నుంచి రూ. 60 వేల సబ్సిడీ ఇస్తారన్నారు. 150-300 యూనిట్లు వాడితే 2 లేదా 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ. 60 వేల నుంచి రూ. 78 వేల వరకు సబ్సిడీ, 300 యూనిట్లకు పైగా వాడితే 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ. 78 వేల సబ్సిడీ ఇస్తారన్నారు. డబ్ల్యుడబ్ల్యుపిఎం సూర్యఘర్



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ ఈఈ గంగాధర్

జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ ఛార్జీల భారం నేపథ్యంలో ఇంటిపైకప్పు పైనే విద్యుత్ తయారు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎండవేడిమితో పాటు విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చన్నారు. ఒకవేళ ప్లాంట్ ద్వారా విద్యుత్ మిగిలితే దానిని పవర్ గ్రిడ్‌కు అనుసంధానించి ప్రభుత్వమే కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తుందన్నారు. ఈఈతో పాటు డీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి ఉన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లితండాకు రోడ్డు వేయించాలని, అమడ గూరు మండలంలోని పూలకుంటపల్లి పంచాయతీ దాదివారిపల్లి తండాలో ప్రశాంత వాతావరణం కల్పించి, హత్యకు గురైన భూక్య వెంకటరమణనాయక్ కుటుంబానికి ఆర్థికసాయం అందించి, అతడి కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రతి ఇంటికీ కొళాయి, గ్రామాల్లో అంగన్వాడీలు, పిహెచ్‌సిలు, శ్మశానవాటికలు, పాఠశాలలు, తదితర మౌలిక సదుపాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, శంకర్‌నాయక్

కల్పించాలన్నారు. స్పందించిన కలెక్టర్ ఆయా సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ కొండయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, ముదిగుబ్బ జడ్పిటిసి సేవే నాయక్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మల్లికార్జుననాయక్, కృష్ణానాయక్, సుధాకర్‌నాయక్, లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఏర్పాటు విప్లవాత్మక నిర్ణయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు అప్పట్లో డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసి విప్లవాత్మక నిర్ణయం తీసు కున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ భార్య పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ -భవిష్యతుకు గ్యారెంటీ'లో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని 2వ వార్డులో పర్యటించారు. ముందుగా స్థానిక మహిళలు ఆమెకు హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి టిడిపిని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేగా పరిటాల శ్రీరామ్‌ని గెలిపించుకుని ధర్మవరాన్ని కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో ముతుకూరుబీబీ, మాధన మహేశ్వరి, భీమనేని గీతావాణి, స్వర్ణకుమారి, కత్తుల సునీత, మున్నీ, భాను, నాగరత్న, శారద, సునంద, మీనాక్షమ్మ, మాలతి, వసంత, ఇందిర, రమాదేవి, ప్యారీమా, వహీద, నాగూర్‌బి, షమీమ్, అశ్వర్థమ్మ, ఆదెమ్మ, పరిశే సుధాకర్, ఫణికుమార్, తలారి చంద్రమోహన్ బాబు, నాగూర్‌హుస్సేన్, కేశగాళ్ల శీన పాల్గొన్నారు.



2వ వార్డులో ప్రచారం చేస్తున్న పరిటాల జ్ఞాన

టిడిపి సత్తా చూపిద్దాం : పరిటాల శ్రీరామ్

ధర్మవరం నియోజకవర్గంలో టిడిపి ఎంత బలంగా ఉందో మరోసారి చాటిచెప్పే సమయం వచ్చిందని ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీరామ్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ కియా కంపెనీ వద్ద నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' బహిరంగ సభకు ధర్మవరం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి టిడిపి శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లాలని పిలుపు నిచ్చారు. ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు.

సచివాలయం తనిఖీ

పెనుకొండ : మండలంలోని కురుబవాండ్ల గ్రామ సచివాలయాన్ని శనివారం మంత్రి ఉషశ్రీచరణ్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. సచివాలయం ఉద్యోగుల పని తీరుపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే వారి పట్ల మర్యాదగా మెలగాలని, విధుల పట్ల అలసత్వం వహించొద్దని సూచించారు. ఆమెతో పాటు సర్పంచి నాగమూర్తి, సచివాలయం కార్యదర్శి, సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

గోరంట్ల : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సిఎం జగనతోనే సాధ్యమవుతుందని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. ఆత్మీయ పలకరింపులో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని ఎస్‌బి ఐ బ్యాంక్ సమీపంలో, గుమ్మయ్యగారిపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సరోజనాగేనాయక్, ఉప సర్పంచులు రాజారెడ్డి, శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు శివారెడ్డి, టౌన్ కన్వీనర్ ధనారెడ్డి, రమణా రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పోతుల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రొద్దం : మండలంలోని కలిపి, వైటి.రెడ్డిపల్లి గ్రా మాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ సందర్శించి సదుపాయా లను పరిశీలించారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించా రు. వెంట డిటి చంద్రశేఖర్, వీఆర్వో ఉన్నారు.

మడకశిర : రొళ్ల మండలంలోని దొడ్డేరి, దాసప్పపాళ్యం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంఇఒ శ్రీధర్ సందర్శించా రు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు, తదితర పనులను పరిశీలిం చారు. మండలంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో కూడా అన్ని వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ఎంఇఒ వెంట ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

తలసేమియా బాధితుడికి కౌన్సిలర్ చేయూత

మడకశిర : ఆపదలో ఉన్న ఓ బాలుడికి కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర అండగా నిలిచారు. నగర పంచాయతీ లోని 17వ వార్డు పాత ఎస్సీ కాలనీకి చెందిన దళిత హనుమంతరాయప్ప కుమారుడు అఖిల్(16) ఆరేళ్లుగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో అఖిల్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే తిప్పేస్వామితో పాటు, అధికారులు, కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కౌన్సిలర్ అఖిల్‌ను వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయించాడు. తద్వారా ప్రభుత్వం రూ. 10 వేలు పింఛన్ మంజూరు చేయడంతో శనివారం ధ్రువీకరణ పాత్రంతో పాటు రూ. 10 వేలను కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర అఖిల్‌కు అందజేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : గుంతకల్లు పట్టణంలో గోజిరియో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 6వ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్ షిప్-2024 పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో మాస్టర్ షాకీర్ శిష్యులు కట విభాగంలో ఐదుగురు పాల్గొని పతకాలు సాధించారు. కదిరి జైన్ పాఠశాలకు చెందిన జోయ ఫాతిమా, మహమ్మద్ జాయేద్, శ్రీశాంతి నికేతన్‌కు చెందిన మహమ్మద్ కైఫ్, రీదాముస్కాన్ మొదటి స్థానం, రామకృష్ణ పాఠశాల నుంచి నూరానాయక్ తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో మాస్టర్ షాకీర్‌ని శాలువా, మెమోంటోతో సత్కరించారు.

పాఠశాలల తనిఖీ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని పలు పాఠశాలలను శనివారం ఎంఇఒ-2 ప్రసాద్ తనిఖీ చేశారు. బీడుపల్లి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అందుతుందా అని ఆరా తీశారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని ఆయాలను ఆదేశించారు. రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎం జివి.రమణను ఆదేశించారు. ప్రశాంతి పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పనులను తనిఖీ చేసి 70 శాతం పూర్తడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

'రా.. కదలిరా..' సభను జయప్రదం చేద్దాం

బికె.పార్థసారథి, సవితమ్మ, పల్లె, నాని, నిమ్మల, సునీల్‌కుమార్, కందికుంట పిలుపు

ప్రజాశక్తి -పెనుకొండ

ఈ నెల 4వ తేదీ మండలంలోని కియా కంపెనీ ఎదుట టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రా.. కదలిరా..' బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి పరిశీలకులు కోవెలమూడి రవీంద్ర(నాని), టిడిపి-జనసేన పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం సవితమ్మ మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబు హాజరవుతారని, నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, జనసేనపార్టీల శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మాధవనాయుడు, నారాయణస్వామి, వెంకటరమణ, బాలకృష్ణ చౌదరి, ఉత్తమ్‌రెడ్డి, ఆంజనేయులు, రంగప్ప, మాగే చెరువు సర్పంచి నరసింహులు, నరసింహులు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో సవితమ్మను నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ నరసింహరావు మర్యాదపూర్వకంగా కలిసి సభ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు సభ వేదిక పనులను పరిశీలించారు. పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో సవితమ్మ టిడిపి వాలంటీర్లతో సమావేశమై సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మీదే అన్నారు.

'రా.. కదలిరా..' సభకు తరలిరండి : టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

'రా.. కదలి రా..' బహిరంగ సభను విజయవంతం చేద్దామని జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసం వద్ద ఆయన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సంసిద్ధం చేయడానికి, ప్రజల్లో చైతన్యం చేయడానికి చంద్రబాబు బహిరంగ సభ నిర్వహిస్తున్నారన్నారు.

పుట్టపర్తి అర్బన్ : స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకులు రవీంద్ర, పల్లె రఘునాథరెడ్డి, నిమ్మల క్రిష్టప్ప మాట్లా డుతూ 'రా.. కదలిరా..' సభ ద్వారా తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లాలన్నారు. ఓటుతో వైసిపికి గుణపాఠం



పార్టీ శ్రేణులతో కలిసి బహిరంగ సభను ఏర్పాట్లను పరిశీలిస్తున్న సవితమ్మ

చెప్పాలన్నారు. అనంతరం ఎన్నికల శంఖారావం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చలి పుల్లయ్య, మండలాల కన్వీనర్లు రామాంజనేయులు, వలిపి శ్రీనివాసులు, రామ కృష్ణ, మల్‌రెడ్డి, శివశంకర్, జయచంద్ర, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, మాణిక్యం బాబా, పిట్ట ఓబుళరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, పుల్లప్ప, సురేష్‌నాయుడు, కాలేనాయక్, గాయత్రి, లావణ్య, రాధమ్మ, మాధవి, మస్తానమ్మ పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, జనసేనపార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి 'రా.. కదలిరా..' బహిరంగ సబను విజయవంతం చేయాలని టిడిపి అభ్యర్థి ఈరన్న సునీల్ కుమార్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు వీఎం పాండురంగప్ప, రవిభూషణ్, రామన్న, ఆదినారాయణ, ఉగ్రనరసింహా, మాజీ కన్వీనర్ రామాంజనేయులు, కెంచప్ప, నాగరాజు, కృష్ణప్ప, పత్తికుంట నరేష్, శ్రీనివాసులు, సుధాకర్, మూర్తినాయక్ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని తన నివాసంలో కదిరి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'రా.. కదలిరా..' సభకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టిడిపి శ్రేణులు, సానిభూతిపరులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, మేడా శంకర్, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఉన్నారు.

31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

ధర్మవరం టౌన్ : ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను విషయంలో పాత బకాయిలపై విధించిన వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసిందని, ప్రజలు సద్వినియోగం చేసుకుని మున్సిపాలిటీ ఆదాయ అభివృద్ధికి సహకరించాలని కమిష నర్ రామ్‌కుమార్ సూచించారు. ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు బకాయి మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి ఈ నెల 31వ తేదీ లోపు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపులు, పన్ను వసూలు కౌం టర్, సంబంధిత వార్డు సచివాలయంలో చెల్లించాల న్నారు. ఆన్‌లైన్, నెట్‌బ్యాం కింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, యుపిఐ ద్వారా కూడా చెల్లించవచ్చు అన్నారు.

పార్కింగ్, వారపు సంతకు వేలం

అమరాపురం : శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి తిప్పేస్వామి అధ్యక్షతన వాహనాల పార్కింగ్‌కు వేలం నిర్వహించారు. బీడీ నరసింహమూర్తి రూ. 60,500కు దక్కించుకొన్నారు. ఏడాది కాలానికి వారపు సంతను శివకుమార్ రూ. 35,600కు దక్కించుకున్నారు. తద్వారా గ్రామపంచాయతీకి రూ. 96,100 ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. వేలం పాటలో బైరప్ప, శివన్న, దేవరాజు, రంగస్వామి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

మామిడి తోటలో అగ్నిప్రమాదం

ఓబుళదేవరచెరువు : మండలంలోని తొట్లివారిపల్లి సమీపంలో రైతు గంగాధర్‌రెడ్డి మామిడి తోటలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 25 చెట్లు దగ్ధం కావడంతో రూ. 2.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. కదిరి నుంచి ఫైర్ ఇంజిన్ సకాలంలో వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి రైతు కోరుతున్నాడు.

టిడిపి నేత మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని వి.అగ్రహారం గ్రామనికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, ఎల్‌ఐసి ఏజెంట్ బిఎస్.మూర్తి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచి ధనుంజయ, వైస్ సర్పంచి ఈరన్న, ఎంపీటీసీ రాధాకృష్ణ, నాగరాజు, సిద్దేశ్, బిఎల్ఆర్ వీరకేతరాయ, హనుమంత రాయప్ప, కెంచప్ప, జయరామప్ప ఉన్నారు.

'కందికుంట' సమక్షంలో టిడిపిలో చేరిక

కదిరి టౌన్ : ఎన్‌పి కుంట మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు శనివారం పట్టణంలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కందికుంట పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు ఖాదర్‌వలి, అమానుల్లా, ముబారక్, షేక్ బాబ్‌జాన్, చాంద్‌బాషా, చిన్న ఆంజనేయులు, లోకేష్, షేక్ షబానా, రఘునాథ్‌రెడ్డి, మసూద్, వెంకటరమణ, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు పివి.పవన్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, సీనియర్ నాయకులు కెపి.అంజనప్పనాయుడు, శ్రీరాములు నాయుడు, దండే రవి, పాలగిరి బాషా, షేక్ అజ్మతుల్లా, దండే గంగశేఖర్, రవి, రాహుల్ పాల్గొన్నారు.



'కందికుంట' సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించండి

ధర్మవరం టౌన్ : ఆర్టీసీ ఆదాయ అభివృద్ధికి ప్రయాణికులు, వ్యాపారులు సహకరించాలని డిపో మేనేజర్ సత్యనా రాయణ కోరారు. ధర్మవరం-పులివెందల రూట్‌లో లక్కీ డిప్ లాటరీని శనివారం ప్రయాణికుల సమ క్షంలో తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. డిఎం మాట్లాడుతూ శ్రీనివాసులు (పులివెందుల), షరీఫ్(వెలిదండ్ల), వినోద్‌కుమార్(పార్నపల్లి)లకు మొదటి మూడు బహుమతులు దక్కాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది, ఎడిసిలు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి

మడకశిర : సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని నియోజకవర్గ ఆ పార్టీ అభ్యర్థి కె.సుధాకర్ కోరారు. ఆయన శనివారం పార్టీ శ్రేణులతో కలిసి రొళ్ల మండలంలోని కాకి గ్రామపంచాయతీలో ఇంటింటికీ వెళ్లి మడకశిరలో కాంగ్రెస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఆయనతో పాటు బిఎన్. మూర్తి, మండల అధ్యక్షుడు గౌడప్ప, పట్టణ అధ్యక్షుడు మంజునాథ్, బూదిపల్లి నాగభూషణ, అన్వర్, నాగరాజు, జిల్లా కార్యదర్శి ఆవినకుంట సతీష్, బ్యాడగేరి పరమేష్, కాకి మూర్తి, శేషాద్రి, కొంకల్లు శివన్న, రామలింగప్ప, దొమ్మరహట్టి రామప్ప, రాజప్ప ఉన్నారు.

బాధిత కుటుంబాలకు 'పల్లె' పరామర్శ

ఓబుళదేవరచెరువు : మండలంలోని అల్లాపల్లి పంచాయతీ బాలప్పగారిపల్లికి చెందిన కిష్టమ్మ శనివారం మృతి చెందగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒడిసిలో పాత్రికేయుడు పి.శంకరప్ప, రెహామాన్, ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి సీనియర్ నేత అంజనప్పను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పల్లె వెంట మండల కన్వీనర్ జయచంద్ర, ఓబుల్‌రెడ్డి, ఆరిఫ్‌ఖాన్ సుధాకర్, చికెన్ షాను, అబ్బులు ఉన్నారు.

'సామకోటి' ఆధ్వర్యంలో చలివేంద్రం

పుట్టపర్తి క్రైమ్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ శనివారం పుట్టపర్తి మార్కెట్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం సంత నిర్వహణతో పాటు కదిరి, బుక్కపట్నం, కొత్తచెరువుకు వెళ్లే బస్సులు ఇక్కడి నుంచే బయల్దేరి వెళ్తుంటాయన్నారు. ప్రయాణికులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సామకోటి తెలిపారు. మున్సిపాలిటీలో అవసరమైన చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నప్ప, నారాయణస్వామి, పోతులయ్య, సంతోష్, అంజి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన సామకోటి


అడవిలో వృద్ధుడి మృతదేహం లభ్యం

చిలమత్తూరు : మండలంలోని డి.గొల్లపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి(68) మృతదేహం శనివారం అడవిలో లభ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రామిరెడ్డి 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ తెలియలేదు. ఉదయం అటుగా వెళ్లిన పశువుల కాపరులకు దుర్వాసన రావడంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. వారి సమాచారం మేరకు గ్రామస్తులు, అతడి కుటుంబీకులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇప్పటికే మిస్సింగ్ నమోదైందని తెలిపారు.

వేసవి తాపం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి మొదలవడంతో వేసవి తాపం పెరుగుతోంది. వారం రోజులుగా ఎండలు మండుతున్నాయి. జనాలు మధ్యాహ్నం సమయంలో బయటకు రావాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి తాపానికి తోడు 2023లో వర్షాభావం కూడా తోడవడంతో నీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే అనేక గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సత్యసాయి జిల్లాలో సుమారు 200 గ్రామాలకుపైగా రవాణా ద్వారా నీటిని అందించాల్సి వస్తోంది. ఇంకా ఎండలు మండి వేసవి తాపం పెరిగితే తాగునీటి కష్టాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లోనూ కొన్ని చోట్ల ఖాళీ బిందెలతో జనాలు నిరసనలకు దిగుతున్నారు. ఎన్నికల సమయం కూడా ఆసన్నమవడంతో నేతలు ప్రజలపై ఎక్కడాలేని ప్రేమను కనబరుస్తున్నారు. నీటి సమస్య ఉందన్న వెంటనే ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని తోలుతున్నారు. ఎన్నికల సమయం కూడా దగ్గరపడుతోంది. వారానికో ప్రధాన పార్టీ రాజకీయ సభను ఏర్పాటు చేస్తోంది. మొదట వైసిపి సిద్ధం సభను ఏర్పాటు చేస్తే ఆ తరువాత వారంలో కాంగ్రెస్ ప్రచారాన్ని అనంతపురం జిల్లా నుంచి ప్రారంభించింది. వచ్చే వారం టిడిపి కదలిరా పేరుతో పెనుకొండలో సభకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అభ్యర్థులు కూడా ఖరారై ఉండటంతో ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. నేతలు ఓటర్లను కలుసుకునే ప్రయత్నాలు ఇప్పటికే ముమ్మరం చేస్తున్నారు. అక్కడక్కడ సొంత పార్టీలో అసమ్మతులున్నా వారిని కలిసి బుజ్జగించి మద్దతు కూడగట్టే పనిని చేపడుతున్నారు. అందులో ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో ఈవారంలో టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గతవారంలో కళ్యాణదుర్గం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అసమ్మతి నేతలున్నా తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే వైసిపి అభ్యర్థి తలారి రంగయ్య రోజుకో గ్రామం వెళ్లి ప్రజలను కలుసుకునే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. రాయదుర్గంలోనూ టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, వైసిపి అభ్యర్థి మెట్టుగోవిందరెడ్డి వరుస కార్యక్రమాలతో బిజీబిజీగా ఉన్నారు. ఇక టిడిపి రాప్తాడులో రా కదలిరా కార్యక్రమం నిర్వహించాలని మొదట తలపెట్టారు. అయితే చివరి నిమిషంలో పెనుకొండకు మార్పు చేశారు. పెనుకొండలో ఈ సభను ఈనెల నాలుగో తేదిన ఏర్పాటు చేస్తున్నారు. దీనికి చంద్రబాబు వస్తున్నారు. తాడిపత్రిలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మరోమారు తాగునీటి సమస్యపై ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇలా వరుసగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.



వీటి నడుమ ప్రజా సమస్యలు పెద్దగా చర్చకు రావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023లో ఖరీఫ్‌లో పంటనష్టం వాటిల్లింది. రూ.250 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం తక్షణం పరహారం అందజేస్తుందా లేదా అన్న చర్చ రైతుల్లో నడుస్తోంది. ఇది ఇవ్వకుండా రైతు భరోసాను ఇస్తోంది. అదే విధంగా తాగునీటి ఇక్కట్లు పెరుగుతున్నాయి. వీటి పరిష్కారానికి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలేవి ఉండటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లోపు వీటిపై దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. కాని పాలకులు ఎన్నికల్లో తలమునకలై ప్రజా సమస్యలను గాలికొదిలేసే విధంగానున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.